



# కరపత్రం

SINCE 2014

సోమవారం ఫిబ్రవరి 03 2025 | సంపుటి :0 | సంచిక : 113 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# ఏఐ అంటే హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా ఏఐ సిటీ నిర్మాణం: శ్రీధర్‌బాబు

ఏఐ సిటీ & యూనివర్సిటీ: 200 ఎకరాల్లో ప్రతిష్టాత్మకంగా ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు.

హైదరాబాద్‌ను ఏఐ హబ్‌గా: రాబోయే రోజుల్లో ఏఐ అంటే హైదరాబాద్ గుర్తుకు రావాలి అన్న లక్ష్యంతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

పరిశ్రమల భాగస్వామ్యం: యూనివర్సిటీ నిర్వహణలో పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు.

డీటీసీసీ కార్యాలయం ప్రారంభం: 500 కొత్త ఉద్యోగాలు, భవిష్యత్తులో 2,000 ఉద్యోగాలు లభించనున్నాయని వెల్లడించారు.

తెలంగాణలో పెట్టుబడులకు అవకాశాలు: 100-120 కంపెనీలు హైదరాబాద్ నుంచి ప్రపంచానికి ఆర్థిక సేవలు అందిస్తున్నాయని, అన్ని పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందని తెలిపారు.



హైదరాబాద్: తెలంగాణ యువతను 'కృత్రిమ మేధ'లో నిపుణులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఏఐ సిటీలో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ సిటీని నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఏఐ అంటే తెలంగాణ.. హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా దాన్ని తీర్చి దిద్దుతామన్నారు. ఈ వర్సిటీ నిర్వహణలో సంబంధిత పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు.



ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తోన్న డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని శ్రీధర్‌బాబు ప్రారంభించారు. డీటీసీసీ.. భారత్‌లో తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించినందుకు శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ సుమారు 500 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 2వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని చెప్పారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు శ్రీధర్ బాబు తెలిపారు.



## ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదు

- ఎమ్మార్పీఎస్ ఉద్యమ చరిత్ర: 1994లో మొదలైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం, 1996లో మొట్టమొదటి బహిరంగ సభ నిర్వహించిందని మందకృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించినప్పటికీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని స్పష్టం చేశారు.
- సాంస్కృతిక కార్యక్రమానికి అనుమతి: తమ మూలాలను కాపాడుకునేందుకు త్వరలో సాంస్కృతిక కార్యక్రమం చేపడతామని, లక్ష డప్పులు, వేయి గొంతుకలతో గిన్నిస్ రికార్డ్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సీఎం అనుమతి ఇవ్వాలని కోరారు.
- వినతిపత్రం సమర్పణ: ఫిబ్రవరి 7న మరోసారి అనుమతి కోరుతూ వినతిపత్రం ఇస్తామని, గాంధేయ మార్గంలోనే తమ ఉద్యమం కొనసాగుతుందని మందకృష్ణ మాదిగ ప్రకటించారు.

2లో

## కుల గణన సర్వేలో పాల్గొనకపోతే మళ్లీ డిటైయిల్స్ ఇవ్వొచ్చు: మంత్రి పొన్నం

- కుల గణన సర్వే విజయవంతం: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో 96% ఆర్థిక, సామాజిక సర్వే పూర్తి చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.
- తప్పిపోయినవారికి మరో అవకాశం: సర్వేలో పాల్గొనని వారు తమ వివరాలను అధికారులకు మళ్లీ ఇవ్వవచ్చని తెలిపారు. అలాగే, సర్వేలో ఏదైనా తప్పులు జరిగినట్లు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
- ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్: కుల గణనపై వ్యతిరేక ప్రచారం చేయడం బలహీన వర్గాలపై దాడి చేసినట్లేనని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా పదేళ్లు పాలించినవారు ఇప్పుడు విమర్శించడం సమంజసం కాదని అన్నారు.



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం (ఫిబ్రవరి 3) గాంధీభవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కుల గణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 96 శాతం ఆర్థిక, సామాజిక సర్వే చేశామని చెప్పారు. కుల గణన సర్వేలో పాల్గొనని వారు అధికారులకు మళ్లీ వివరాలు ఇవ్వొచ్చని తెలిపారు.
బీసీ రిజర్వేషన్లపై అన్ని పార్టీల స్టాండ్ ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కుల గణనపై తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తే.. అది బలహీన వర్గాలపై దాడి చేసినట్లేనని పేర్కొన్నారు. ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న కుల గణనను మేం పూర్తి చేశామని.. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు చేయనివాళ్లు ఇప్పుడు మమ్మల్ని విమర్శించడమేంటని మండిపడ్డారు. కుల గణనపై ప్రతి పక్షాల విమర్శలను బీసీలపై దాడి గానే చూస్తామన్నారు. కుల గణనపై ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కొంటామని తేల్చి చెప్పారు.

2లో



## తెలంగాణలో కొత్తగా 1026 కి.మీ'కవచ్'పనులు

- ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఏర్పాటు
- రాష్ట్రంలో కొత్తగా 1026 కి.మీ'కవచ్'పనులు
- రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి 5,337 కోట్లు
- తెలంగాణలో 100% రైల్వేలైన్ల విద్యుదీకరణ పూర్తి
- త్వరలో దేశ వ్యాప్తంగా 100 నమో భారత్ రైళ్లు
- ఏపీకి రికార్డు స్థాయిలో రూ. 9,417 కోట్ల కేటాయింపు
- కాజీపేట స్టేషన్ అభివృద్ధి చేస్తున్నం

సికింద్రాబాద్ కేంద్రంగా 'కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'ఏర్పాటు చేయబోతున్నట్టు రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణలో వంద శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ పూర్తయిందని వివరించారు. రూ. 41,677 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు ప్రకటన ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి 5,337 కోట్ల రూపాయలు కేటాయించినట్టు చెప్పారు.

2లో

## ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది: పాయల్ శంకర్



కేంద్ర బడ్జెట్ చూసి దేశ ప్రజలంతా సంతోషపడుతున్నారని తెలంగాణ భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గడచిన 75 ఏళ్లల్లో ఎప్పుడూ ఇలాంటి బడ్జెట్ రాలేదని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీల గురించి మాట్లాడాలన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.
"కులగణన సర్వేలో బీసీల జనాభాను తగ్గించి చూపించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది. ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. భారాసకు పట్టిన గతే త్వరలోనూ కాంగ్రెస్ ప్రభుత్వానికీ పడుతుంది" అని విమర్శించారు.

## కులగణనపై కాంగ్రెస్ కాకిలెక్కలు..

### బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో బిల్లు పెట్టాలి: ఎమ్మెల్సీ కవిత

- బీసీ రిజర్వేషన్ల పెంపు డిమాండ్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని కోరారు. కేవలం లఘు చర్చ కాకుండా, బీసీలకు న్యాయం చేసే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2లో

## ఉప ఎన్నికలకు సిద్ధం కండి

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు తప్పదు
- సుప్రీం గత తీర్పులే ఇందుకు నిదర్శనం
- పార్టీ నేతలకు ఎక్స్ వేదికగా కెటిఆర్ పిలుపు
- కెటిఆర్ పిటిషన్‌ను 10వతేదీకి వాయిదా వేసిన సుప్రీం

2లో



# కులగణనపై కాంగ్రెస్ కాకిలెక్కలు..

## బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో బిల్లు పెట్టాలి: ఎమ్మెల్సీ కవిత

మొదటిపేజీ తరువాయి

**కుల గణనలో తేడా: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తాజా కుల గణనలో, గత సర్వేతో పోల్చితే బీసీ జనాభా తగ్గినట్లు చూపించడం అన్యాయమని విమర్శించారు. సర్వే పూర్తిగా నిజమైనదేనా అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని పేర్కొన్నారు.**

సర్వే డేటా ప్రజలకు అందుబాటులోకి తేవాలి: 3.5 కోట్ల సర్వే పత్రాలను ప్రజల పరిశీలన కోసం అందుబాటులో పెట్టాలని, స్క్రూటినీకి కనీసం 15 రోజుల సమయం ఇవ్వాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

పెద్దపల్లి: బీసీ కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు చెప్పిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. శాసన సభలో లఘు చర్చతో లాభం లేదన్నారు. బీసీలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్న చూపని ప్రశ్నించారు. జిల్లా పర్యటనలో భాగంగా పెద్దపల్లికి చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేమెంతుంటే.. మాకంత వాటా అంటూ రాహుల్ గాంధీ నినాదం ఇచ్చారని గుర్తుచేశారు. దానిప్రకారం 46.3 శాతం బీసీలు, 10 శాతం బీసీ ముస్లింలు.. మొత్తం కలిపి 56 శాతం జనాభా ఉందని చెప్పారు. రిజర్వేషన్లను అమలు చేయాలంటూ రాజ్యాంగం పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ.. బీసీల విషయంలో ఎందుకు వెనక్కితగ్గుతున్నారని నిలదీశారు.



2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల ఇండ్లు, 3.5 కోట్ల జనాభా ఉన్నట్లు తేలిందని చెప్పారు. 2014లో నాటి సీఎం కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 1.03 కోట్ల ఇండ్లు, 3 కోట్ల 68 లక్షల జనాభా అని తేలిందని వెల్లడించారు. అప్పుడు నాలుగేండ్ల వ్యవధిలో చేసిన సర్వేలోనే 20 లక్షల ఇండ్లు, పెరిగాయి. 2014-2024 వరకు పదేండ్లలో ఎన్ని ఇండ్లు, ఎంత జనాభా పెరిగి ఉండాలన్నారు. ఎన్ని కుటుంబాలు పెరగాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన సమగ్ర కుల గణనతో కోటి 15 లక్షల ఇళ్లు ఉన్నాయని, రాష్ట్ర జనాభా 3 కోట్ల 70 లక్షలు అని చెబుతున్నదని తెలిపారు. 2011 నుంచి 14 వరకు 20 లక్షల ఇండ్లు పెరిగితే.. 2014 నుంచి పదేండ్లలో సుమారు 60 లక్షల కుటుంబాలు పెరగాలన్నారు. ఏ లెక్కన చూసినా తెలంగాణలో 50 నుంచి 52 శాతం బీసీలు ఉన్నట్లు తెలుస్తుందని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 46.2శాతం ఉన్నట్లు తేల్చడం బాధాకరమని చెప్పారు. ఇది ఎంతవరకు సబబని సీఎం రేవంత్ రెడ్డి గుండెమీద చేసుకుని చెప్పాలన్నారు. ఈ కాకి లెక్కలతో అయినా బీసీల రిజర్వేషన్ల పెంచడం కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇదే తరహా మోసాన్ని బీహార్, కర్ణాటకలో చేసిందని విమర్శించారు. తెలంగాణలో కూడా మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

సకల జనుల సర్వేకు, ఇప్పటి ఈ సర్వేకు 21 లక్షల బీసీ జనాభా తేడా కనిపిస్తున్నదని చెప్పారు. సకల జనుల సర్వేలో ఓసీల జనాభా చాలా తక్కువ అని తేలిందని, ఇప్పుడు చాలా ఎక్కువగా కనిపిస్తున్నదని వెల్లడించారు. దీని వెనుకున్న మతలబు ఏమిటో ప్రభుత్వం చెప్పాలన్నారు. కేవలం ఓసీల జనాభా పెరిగి బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గుతుందా అని ప్రశ్నించారు. సకల జనుల సర్వే ద్వారా కేసీఆర్ మొదటి అడుగు వేశారని, ఆ సర్వే డేటా ఆధారంగా కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు.

తెలంగాణ జాగృతి, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు చేసిన ఉద్యమాల వల్ల బీసీ జనాభా వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేసిందన్నారు. దీన్ని ప్రజాస్వామికవాదులంతా స్వాగతించాలని చెప్పారు. తెలంగాణ జాగృతి ఉద్యమాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. డెడికేటెడ్ కమిషన్ ద్వారానే కులగణన జరగాలని కోరినా ప్రభుత్వం ప్లానింగ్ శాఖ చేత సర్వే చేయించిందని విమర్శించారు. సర్వే సరిగ్గా జరలేదని ప్రతి ఒక్కరి మనసుల్లో ఉందని చెప్పారు. తమ ఇండ్లకు సర్వే కోసం రాలేదని ప్రతీ గ్రామంలో చాలా మంది అంటున్నారని వెల్లడించారు. సర్వే సరిగ్గా జరగకపోతే డేటా వాస్తవమైనదా కాదా అన్న అనుమానాలు కలుగుతున్నాయని వెల్లడించారు. బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం సర్వే డేటాను సమీక్షకు పెట్టాలని డిమాండ్ చేశారు. 3.5 కోట్ల సర్వే పత్రాలను ప్రజల స్క్రూటినికీ అందుబాటులోకి పెట్టాలని, స్క్రూటినీకి 15 రోజుల సమయం ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో దీనిపై కేవలం స్వల్పకాలిక చర్చ పెడుతామని ప్రభుత్వం చెప్పడం బాధాకరమని చెప్పారు. బీసీలంటే అంత చిన్న చూపు ఎందుకని ప్రశ్నించారు. చిన్న చర్చ పెట్టి ఏం లాభం చేస్తారని నిలదీశారు. బీసీ అంశాలు, ఎస్సీ వర్గీకరణ అంశంలో రాజకీయాలు తగదన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: 30 ఏళ్లలో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెప్పుల తయారీ, డప్పు వాయిద్యం తమకు వారసత్వంగా వచ్చాయన్నారు. తమ మూలాలు కాపాడుకునేందుకు త్వరలో సాంస్కృతిక కార్యక్రమం చేపడతామని చెప్పారు.

"ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1994లో మొదలుపెట్టాం. 1996 మార్చిలో మొట్టమొదటి బహిరంగసభ నిర్వహించాం. ఉద్యమ విస్తరణ కోసం మొదటి రెండేళ్లు పనిచేశాం. వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించాం. లక్షల మందిని సమీకరించినా ఎప్పుడూ సమస్య రాలేదు. ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదు. అలా చేస్తే ఇన్నేళ్లు ఉద్యమం నిలబడేది కాదు. అస్తిత్వం కోసమే మా సాంస్కృతిక ప్రదర్శన. దీనికి అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందనడం అన్యాయం. ఆరు అంశాలు చూపుతూ అనుమతి నిరాకరిస్తూ నోటీసులు ఇచ్చారు. దానికి వివరణ ఇస్తూ మరో వినతిపత్రం ఇస్తాం. గాంధేయ మార్గంలోనే ప్రయాణం కొనసాగిస్తాం. లక్ష డప్పులు, వేయి గొంతుకల కార్యక్రమానికి సీఎం అనుమతి ఇవ్వాలి. ఫిబ్రవరి 7న కార్యక్రమం అనుమతికి మరోసారి వినతిపత్రం ఇస్తాం. గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా కార్యక్రమం ఉండబోతోంది." అని మందకృష్ణ మాదిగ అన్నారు.

# కుంభమేళాలలో జనజాతర



- వసంతపంచమితో పోటెత్తిన భక్తజనం
- మూడంచెల భద్రతతో సమీక్షించిన అధికారులు
- భక్తుల తాకిడిపై సిఎం యోగి వేకువజామునే సమీక్ష

ప్రయాగ్‌రాజ్, ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో భక్తులు జాతర కొనసాగుతోంది. సోమవారం వసంత పంచమి సందర్భంగా అమృతస్నానాలకు భక్తులు క్యూ కట్టారు. సోమవారం తెల్లవారుజాము నుంచే త్రివేణీసంగమంలో పెద్ద ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు చేసారు. వసంత పంచమి ని పురస్కరించుకొని సోమవారం 4 కోట్ల నుంచి 6 కోట్లమంది జనం రానున్నట్లు అధికారులు అంచనా వేసారు. మౌనీ అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కుంభమేళా ప్రాంతంలో భద్రతను మరింత పటిష్టం చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. అటు యూపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెల్లవారుజామున 3.30 గంటల నుంచే పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఉదయం 6 గంటల్లోపే కొంతమంది అఖాడాలు అమృతస్నానాలు ఆచరించారు. నాగసాధువులు కూడా రానున్నారు. త్రివేణీ సంగమం వద్ద భక్తులపై హెలికాప్టర్లతో పూలవర్షం కురిపించారు. తెల్లవారుజామున 4 గంటల వరకు 16.58 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఇప్పటివరకు 34.97కోట్ల మంది పుణ్యస్నానాలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. 144ఏళ్లకోసారి వచ్చే ఈ మహా కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. జనవరి 29న మౌనీ అమావాస్యను పురస్కరించుకుని కుంభమేళాకు భక్తులు పోటెత్తిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగి 30 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. మరోవైపు, సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది.

# కుల గణన సర్వేలో పాల్గొనకపోతే మళ్లీ డిటైయిల్స్ ఇవ్వొచ్చు: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

అన్ని వర్గాలకు ఫలితాలు అందేవరకు పోరాటం ఆగదన్నారు. కుల గణన సర్వేలో కేసీఆర్ ఫ్యామిలీలో ఎమ్మెల్సీ కవిత ఒక్కరే అధికారులకు డిటైయిల్స్ ఇచ్చారని తెలిపారు. కొన్నిచోట్ల కుల గణన కోసం అధికారులు వస్తే కుక్కలను వదిలారని ఆగ్రం వ్యక్తం చేశారు. సర్వేలో తప్పులు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. విజయవంతంగా కుల గణనను పూర్తి చేసిన ప్లానింగ్ కమిషన్.. ఈ రిపోర్టును కేబినెట్ సబ్ కమిటీకి అందజేసింది.

దీంతో రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు ఎంత శాతం ఉన్నారనేది తేలిపోయింది. కుల గణన నివేదికకు ఈ నెల 5వ తేదీన కేబినెట్, అసెంబ్లీ ఆమోదం తెలపనున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణనపై ప్రతిపక్షాలు విమర్శలు ఎక్కు పెట్టాయి. కుల గణన సర్వే సరిగ్గా నిర్వహించలేదని.. రిపోర్టు తప్పుల తడక అని ఆరోపణలు చేస్తున్నాయి ప్రతిపక్షాలు. ఈ క్రమంలో కుల గణన సర్వేపై ప్రతిపక్షాల వి మర్శలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు.

# ఉప ఎన్నికలకు సిద్ధం కండి

మొదటిపేజీ తరువాయి



బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు చూస్తుంటే పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పైనా వేటు పడుతుందన్నారు. అలాగే, ఫిరాయింపు దారులను కాంగ్రెస్ పార్టీ కాపాడడం అసాధ్యమన్నారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యే వ్యవహారంలో కేటీఆర్ వేసిన పిటిషన్ విచారణ సోమవారం నాటికి వాయిదా పడింది. గతంలో ఇదే వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌లతో కలిపి విచారిస్తామని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ఇక, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కాలయాపన చేస్తున్నారని సుప్రీంకోర్టులో కేటీఆర్ జనవరి 29న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ వెంటనే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. అలాగే, ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై కూడా విచారణ కొనసాగుతుంది. ఈ క్రమంలో.. ఈ రెండు పిటిషన్లను కలిపి ఈ నెల 10వ తేదీన విచారిస్తామని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో పార్టీ మారిన వారిపై వేటు పడటం ఖాయమని, ఉప ఎన్నికలకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఈ సందర్భంగా కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మీద గెలిచిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్ , అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్‌లు కాంగ్రెస్‌లోకి పార్టీలో చేరారు. వీళ్లపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాది ఆర్య రామసుందరం వాదనలు వినిపించారు. ఇదే వ్యవహారంపై గతంలో దాఖలైన పిటిషన్‌కు కేటీఆర్ వేసిన పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. కేటీఆర్ వేసిన పిటిషన్‌ను.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు అనర్హత పిటిషన్‌తో కలిపి విచారిస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. పాత పిటిషన్‌తో కలిపి కేటీఆర్ పిటిషన్‌పై విచారణ చేస్తామని చెబుతూ తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 10కి వాయిదా వేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన పిటిషన్‌పై రెండు రోజుల క్రితం సుప్రీంలో విచారణ జరుగగా.. సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ ఆలస్యం చేయడాన్ని తప్పుపట్టింది. ఇంకా ఎంత సమయం కావాలంటూ గత విచారణలో గట్టిగా ప్రశ్నించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేదాకనా అని ప్రశ్నించింది. స్పీకర్‌కు ఎంత సమయం కావాలో మీరే కనుక్కుని చెప్పాలంటూ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఆదేశించింది. ఆపై తదుపరి విచారణను వాయిదా వేసింది.

# తెలంగాణలో కొత్తగా 1026 కి.మీ'కవచ్'పనులు

మొదటిపేజీ తరువాయి




రైలు ప్రమాదాల నివారణపై ప్రధానంగా కేంద్రం దృష్టి పెట్టింది. ఇటీవల పలుచోట్ల రైళ్లు ఢీకొనడం, పట్టాలు తప్పడం ఘటనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పట్టాల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి ఉద్దేశించిన కవచ్ టెక్నాలజీపై ఈ సారి కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో 1026 కిలోమీటర్ల మేర కవచ్ పనులు చేపడుతామని అశ్విన్ వైష్ణవ్ వెల్లడించారు. 2026లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

### మరిన్ని వందే భారత్ రైళ్లు

తెలంగాణ నుంచి ప్రస్తుతం ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని వాటిని పెంచనున్నట్టు తెలిపారు. పేద వర్గాల కోసం నమో భారత్ రైళ్లను నడుపుతున్నామని అన్నారు. త్వరలో దేశమంతా దాదాపు 50 నమో భారత్ ఎక్స్‌ప్రెస్‌లు తీసుకురానున్నామని, వీటి ద్వారా పేదలకు ఎక్కువగా లబ్ధి కలుగుతుందని వివరించారు. 100 అమృత్ భారత్ రైళ్లు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. 1000 కి.మీ వరకు 450 రూ ప్రయణించేలా నాన్ ఏసీలో అమృత్ భారత్ రైళ్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### ఏపీకి రూ. 9,417 కోట్లు

ఈ సారి బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు రూ. 9417 కోట్లు కేటాయించినట్టు మంత్రి తెలిపారు. 84,559 కోట్ల రూపాయల ప్రాజెక్టులు ప్రాసెస్ లో ఉన్నాయని అన్నారు. 73 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేశామన్నారు. 100% విద్యుదీకరణ పూర్తయిందని వివరించారు. 1,560 కిమీ రైల్వే ట్రాక్ నిర్మించామని చెప్పారు. 8 వందే భారత్ రైళ్లు 16 జిల్లాలను కలుపుతూ సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్స్

**ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 తొలి సెషన్**

**మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు మలివిడత**

**భారీగా ఏర్పాట్లు చేసిన ఇంటర్ బోర్డు**

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం మొదటి సారి సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 208 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూనియర్

# ఏఐ అంటే హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా ఏఐ సిటీ నిర్మాణం: శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "యువత వినూత్నంగా ఆలోచించాలి. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. హైదరాబాద్ అనగానే అందరికీ కేవలం సాఫ్ట్‌వేర్ కంపెనీలే గుర్తుకొస్తాయి. కానీ.. ఇక్కడ అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయి. 100 నుంచి 120 కంపెనీలు హైదరాబాద్ నుంచే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయి. అన్ని రకాల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉంది. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యమున్న మానవ వనరులను మేం అందిస్తాం. నిశ్చింతగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చు" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఫిబ్రవరి 03 2025

# మాయమైపోతున్నదమ్మా బిజెపి పార్టీ

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**

భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్ష ఎంపిక నిన్న జరిగింది. మెట్ పల్లి కి చెందిన రాచకొండ యాదగిరి బాబును ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగిందని వాట్సప్ వార్త చూసి జిల్లా బిజెపి క్యాడర్ ఒక్కసారి ఆశ్చర్యానికి, ఆవేశానికి గురైంది.ఒక పక్క నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా ఉన్న కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గారు ఉండగా, ఇంకో పక్క ధర్మపురి ఎమ్మెల్యేగా మరియు ప్రభుత్వ విప్ గా అడ్లూరి లక్ష్మణ్ గారు అధికార కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. రెండు పార్టీలకు ఉద్దండులు సారథ్యం వహిస్తుండగా మరుగుజ్జు లాంటి యాదగిరిని బిజెపి జిల్లా బిజెపి అధ్యక్షునిగా ప్రకటించడం చూసి జనం నవ్వుకుంటున్నారు.యాదగిరి కనీసం బిజెపి గ్రామ కమిటీ అధ్యక్ష భాధ్యత గాని,పట్టణ అధ్యక్ష భాధ్యత గాని, మండల అధ్యక్ష భాధ్యత గాని నిర్వహించలేదు. ఇప్పుడు ఏకంగా అతడిని జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చెయ్యడం పట్ల కార్యకర్తలు విస్మయానికి లోనవుతున్నారు.యాదగిరి వ్యక్తిగత ప్రవర్తన తెలిసిన వారు ఎవ్వరు కూడా ఈ ప్రకటనను జీర్ణించుకోలేక పోతున్నారు..2001 సం.లో మెట్ పల్లిలో వార్డ్ మెంబర్ కు పోటీ చేస్తే కేవలం 7 ఓట్లు మాత్రమే వచ్చాయని, మెట్ పల్లి మున్సిపల్ గా మారిన తర్వాత కౌన్సిలర్ గా పోటీ చేస్తే 33 ఓట్లు మాత్రమే లభించాయని కార్యకర్తలు యాదగిరి గతం గుర్తు చేసుకుంటున్నారు.కనీసం తన కులం బలం గానీ, పార్టీ క్యాడర్ ఆమోదం గానీ లేని యాదగిరి ఎంపిక పట్ల జిల్లా బిజెపి కార్యకర్తల్లో అసహనం తాండవిస్తున్నది.బిజెపి జిల్లా అధ్యక్షుని ఎంపిక పార్టీ పుట్టి ముంచే సూచనలు కనిపిస్తున్నాయి.

### కాకారాయుడికి పదవులా

గతంలో జిల్లా బిజెపి అధ్యక్షుడుగా పనిచేసిన దివంగత బాజోజి భాస్కర్ ను కాకా పట్టి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా ప్రకటింప జేసుకున్నాడని, నిన్నటి వరకు జిల్లా బిజెపి అధ్యక్షుడిగా పనిచేసిన మోరపల్లి సత్యనారాయణ రావు వ్యక్తిగత ప్రయోజనాలు తీర్చి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమింప బడ్డాడని అందరూ మాట్లాడుకుంటున్న బహిరంగ రహస్యం.

### ఇంకెవరూ లేరా ?

జిల్లా బిజెపి లో త్యాగాలు చేసిన వారు ఎందరో ఉన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన వారు, ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన కార్యకర్తలు నాయకులు పుష్కలంగా ఉన్నారు.జిల్లా వ్యాప్తంగా ఎందరో అనుభవం ఉన్న నాయకులున్నారు. వార్డ్ మెంబర్లుగా, సర్పంచులుగా,ఎంపీటీసీ లుగా, మండలాధ్యక్షులుగా పనిచేసినవారు, జెడ్పీటీసీ లుగా పని చేసిన వారు జిల్లా బిజెపి లో ఉన్నారు.జిల్లాలో క్వాలిఫైడ్ డాక్టర్లు,న్యాయవాదులుజిల్లా స్థాయి నాయకులుగా ఉన్న వ్యక్తులు ఎందరో ఉన్నారు.చివరికి ఎమ్మెల్యేలుగా పోటీచేసిన నాయకులు, పోటీ పడగలిగే నాయకులు కూడా ఎందరో ఉన్నారు.ఇటువంటి వారిని కాదని ఏనాడు పార్టీ జెండాలు మోయని,కనీసం గోడ రాతలు రాయని,పోస్టర్లు అంతించని యాదగిరిని జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చెయ్యడం పట్ల జిల్లాలోని బిజెపి శ్రేణులు పార్టీ నాయకత్వ ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు.బిజెపి హార్డ్ కోర్ కార్యకర్తలు, అంకితభావం గల కార్యకర్తలు, నక్సలైట్ల చేత దాడులకు గురైన వారిని విస్మరించి కనీసం పేపర్ పై రాయడం కూడా రాని యాదగిరిని అధ్యక్షునిగా ప్రకటించడం పట్ల జగిత్యాలకు చెందిన ఏసీఎస్ రాజు, అరవ ప్రజోత్, కుర్మాచలం సతీష్,రత్నాకర్,ప్రమోద్ మొదలగు నాయకులు ఈ ఎంపికను నిరసిస్తూ ఏ విధంగానూ యోగ్యత లేని యాదగిరి నాయకత్వాన్ని ఎవ్వరూ అంగీకరించరని గళమెత్తారు.పార్టీ సిద్ధాంతం గురించి, పార్టీ చరిత్ర గురించి ఏ కనీస జ్ఞానం లేని, ఏ అవగాహనా లేని యాదగిరి నాయకత్వంలో కార్యకర్తగా పనిచేయడం అవమానకరమని మెట్ పల్లి సీనియర్ బిజెపి నాయకులు శ్రీ ఇల్లెందుల కృష్ణమాచారి, కొండ్లెపు శ్రీను,అంబల్ల జగన్, గోదూర్ చంద్రం గౌడ్ తో పాటు పలువురు బిజెపి కార్యకర్తలు బిజెపి జిల్లా అధ్యక్ష ఎంపికను వ్యతిరేకిస్తున్నారు.రాయికల్ సీనియర్ బిజెపి నాయకులు శ్రీ మోటకాడి మోహన్ రెడ్డి, గాజెంగి అశోక్, బొమ్మకంటి రాంగోపాల్, కుర్మ నారాయణ రెడ్డి తో పాటు రాయికల్ బిజెపి క్యాడర్ జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షుని ఏకపక్ష ఎన్నిక పార్టీ కార్యకర్తల మనోభిప్రాయానికి వ్యతిరేకమని అన్నారు.

కోరుట్ల కు చెందిన బిజెపి నాయకులు యాదగిరి ఎన్నిక ఆమోదయోగ్యం కాదని అతని నాయకత్వం అంగీకారయోగ్యం కాదని అన్నారు.

### అసలు కార్యకర్తలను మింగేస్తున్న షాడో కార్యకర్తలు

బిజెపి జిల్లా అధ్యక్ష ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించి ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య బద్దంగా అధ్యక్ష ఎన్నికలు జరుపుతామని రాష్ట్ర పార్టీ నుండి ప్రకటన వెలువడింది. కాని జగిత్యాల జిల్లా అధ్యక్షుని ఎంపిక ఎప్పుడు జరిగింది? ఎక్కడ జరిగింది? అని బిజెపి లో ఒక్కసారిగా యాదగిరి ఎంపిక పట్ల తిరుబాటు గళం వినిపిస్తున్నది.





### పార్టీ వాడు కాదు.. మన వాడా కాదా

మోడీ ప్రభావంతో, జాతీయ భావన జాగృతితో దేశ వ్యాప్తంగా బిజెపి పట్ల అనుకూల పవనాలు వీస్తున్నాయి.దేశం పట్ల అభిమానం, హిందూ ప్రభంజనం.. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నది.దశాబ్దాలుగా పార్టీ పనిచేస్తూ ఆర్థిక స్థిరత్వం లేక ఎందరో బిజెపి కార్యకర్తలు కేవలం పార్టీ పనిమనుషులుగా మారిపోయారు.అపారమైన సిద్ధాంత నిబద్ధత ఉన్నా, అంకిత భావం ఉన్నా, అహరహం పార్టీ కొరకు జీవితాలు త్యాగం చేసినా ఎన్నికల రాజకీయాల్లో నిజమైన బిజెపి కార్యకర్తలు వెనకబడిపోతున్నారు.

బిజెపి కార్యకర్తలకు పార్టీ పట్ల అంకిత భావం ఉండడం ముఖ్యం కాదు. కార్యకర్త మనవాడా కాదా..అన్నదే ముఖ్య అర్హతగా మారిపోయింది.పార్టీ పట్ల విశ్వాసం కంటే, నాయకుని పట్ల విశ్వాసం పార్టీ పదవులకు కొలమానం గా మారింది.బిజెపి లో ఇప్పుడు ఆయారాం గయారాం ల కాలం నడుస్తున్నది.డబ్బులున్న వాడే నాయకుడు అని బిజెపి నాయకత్వం భావిస్తున్నదని..సిద్ధాంత నిబద్ధతకు విలువ లేదని క్యాడర్ మౌనంగా రగిలిపోతున్నది.అంకిత భావం గల కార్యకర్తలు, నాయకులు పార్టీకి సుంకరులుగా మారిపోయారని, సేవలకు త్యాగాలకు విలువ తగ్గిందని కార్యకర్తలు నిర్లిప్తంగా మారుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఈ మాత్రం ఎమ్మెల్యే,ఎంపీ సీట్లు గెలవడానికి మోడీ చరిష్మా, హిందుత్వ విప్లవం కారణమని విశ్లేషకుల నిశ్చితాభిప్రాయం.బిజెపి కి అనుకూల వాతావరణం ఉన్నా, పోటీ చెయ్యడానికి తగిన ఆర్థిక వనరులు లేక సమర్థులైన బిజెపి నాయకులు ఎన్నికల పోటీకి వెనకబడి పోతున్నారు.ఈ అవకాశం అందిపుచ్చుకున్న కొత్త వారు పార్టీలో చేరి, గెలిచి నిజమైన కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నారు.పైగా త్యాగాలు చేసిన వారి గురించి చులకనగా మాట్లాడుతున్నారని జిల్లా సీనియర్ బిజెపి నాయకులు ఏసిఎస్ రాజు గారు అంటున్నారు.పార్టీ లైన్ కాదని నాయకులు స్వంత మనుషులకు,తాబేదార్లకు కీలక పార్టీ భాధ్యతలు అప్పగించి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మెట్ పల్లి సీనియర్ బిజెపి నాయకుడు కృష్ణమాచారి అన్నారు.గాలివాటం నాయకులు ఎప్పుడూ పార్టీ నిర్మాణానికి పనికిరారని, యాదగిరి లాంటి వ్యక్తులు కుప్ప మీద కూర్చుండే అవకాశ వాదులని అన్నారు. ఇటువంటి వారికి పార్టీ పదవులు అప్పగించి నాయకులు ఏ సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు.రాష్ట్ర నాయకత్వాన్ని, కేంద్ర బిజెపి నాయకత్వాన్ని కూడా ప్రభావితం చేసే శక్తి తమకుందని కార్యకర్తలను దబాయిస్తున్నారు. ఊరుదాటి కూడా రాలేని సామాన్య బిజెపి కార్యకర్తలు తమను ఏమీ చేయలేరని అధికార పదవులను అనుభవిస్తున్న నాయకులు ఎప్పటికీ ప్రమాదమేనని అన్నారు.యాదగిరి లాంటి వ్యక్తుల వల్ల పార్టీ ఎదగడం అటుంచి జిల్లాలో పార్టీ మాయమై పోతుందని, యాదగిరి నాయకత్వాన్ని అసలు ఒప్పుకునే ప్రశ్నే లేదని జిల్లా బిజెపి లో అంతర్గత చర్చలు మొదలయ్యాయి.బిజెపి కుమ్ములాటలు చూసి ప్రత్యర్థి పార్టీల నాయకులు సంబరపడుతున్నారు.మోడీ హవా ఉన్నా, హిందుత్వ గాలులు వీచినా, గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఎందుకు తక్కువ సీట్లు సాధించినా నాయకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. పార్లమెంట్ అభ్యర్థుల అహంకార ధోరణి, కార్యకర్తల పట్ల నిర్లక్ష్య ధోరణి వల్ల దేశంలో చాలాచోట్ల బిజెపి దెబ్బతిన్నది. క్యాడర్ నిర్లిప్తంగా మారడం వల్ల 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి 240 సీట్లకే పరిమితమైన విషయం నిర్వివాదాంశం.కేంద్రంలో మోడీ ప్రధానిగా ఉండాల్సిందేనన్న కార్యకర్త ప్రజల ప్రభలమైన కోరిక వల్లే బిజెపి ఈ మాత్రం సీట్లు సాధించింది.నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో గత కొంత కాలం వరకు బిజెపి నాయకులుగా హడావుడి చేసిన కొందరు ఇప్పుడు మాయమయ్యారని గుర్తు చేస్తున్నారు.పార్టీలో ఎప్పుడూ కనిపించని వ్యక్తులు, అసలు పార్టీ పనిచేయని వ్యక్తులు, కనీసం పారీ సభ్యత్వం కూడా లేని వ్యక్తులు కీలక పదవుల్లోకి వస్తున్నారని,ఈ పరిస్థితిని ఇలాగే కొనసాగిస్తే నిజమైన క్యాడర్ నిష్క్రియా పరత్వం లోనికి జారిపోవడం ఖాయమని కార్యకర్తలు అంటున్నారు.మాయమై పోతున్నదమ్మా బిజెపి పార్టీ అంటూ బిజెపి కార్యకర్తలు విషాద గీతాలు పాడుకుంటున్నారు.మరి,బిజెపి కి అయోధ్య రాముదున్నడుగా పార్టీని గెలిపించడానికి."తక్కువేమి మనకూ రాముడు ఒక్కడుండు వరకు" అని బిజెపి క్యాడర్ ఇకపై తత్వాలు పాడుకోవాల్సిందేనా?

# 15,000 రైతు భరోసా కావాలి. రైతు నాయకులు మిరియాల చంద్రశేఖర్ గుప్తా.

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్..**






తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు పత్రాల యాద గౌడ్ జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్ గార్ల ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి రైతు సమస్యలపై చర్చించి అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా యాసంగి పంట మరియు వానకాలం పంట రెండు పంటల డబ్బులు ఎకరాకు 15 వేల రూపాయలు చొప్పున అందించాలని మరియురైతులకు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లను సబ్సిడీ ద్వారా ప్రతి రైతుకు అందేలా చూడాలి మరియు రైతు రుణమాఫీ పథకం ప్రతి రైతుకు అందేలా ఎలాంటి కటాఫ్ డేట్లు పెట్టకుండా రైతులకు రుణమాఫీ వర్తించేలా చూడాలి మరియు ప్రతి గ్రామాలలో విద్యుత్ స్తంభాలు వైర్లు వేలాడుచున్నాయి జిల్లాలో విద్యుత్ అధికారులు స్పందించి ఏ గ్రామంలోనైతే స్తంభాల తీగలు వేలాడుచున్నావో వాటిని సర్వే చేయించి తక్షణమే బిగించేలా చేయాలని కోరుచున్నాము పైన తెలిపిన అంశాలను జిల్లా కలెక్టర్ గారికి మా యొక్క సంఘం తరపున తీర్మానం చేసి వినతి పత్రం సమర్పించినాము ఇట్టి సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అంతం గారి వెంకటేశం మాచినూరి శ్రీశైలం యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మదర్ జిల్లా ముఖ్య సలహాదారుదు మిరియాల చంద్రశేఖర్ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండ ఎల్లం యాదవ్ లంబ పరశురాములు తదితర రైతులు పాల్గొన్నారు

# ఘనంగా సమతా ఫౌండేషన్ చైర్మన్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు:

**కరపత్రం పెద్దపల్లి జిల్లా ప్రతినిది ఫిబ్రవరి 3:**





బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ, ఆపదలో నేనున్నానంటూ ఆర్థిక భరోసా కల్పిస్తూ చేయూత అందిస్తున్న పెద్దపల్లి జిల్లా ఎన్టిపిసి మూడవ డివిజన్ అన్నపూర్ణ కాలనీకి చెందిన సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు, సమతా ఫౌండేషన్ చైర్మన్ దుర్గం నగేష్ - ప్రమీల దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను సమతా సైనిక దళ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ వందనం చేసి మహనీయుల ను స్మరించుకున్నారు. ప్రమీల - నగేష్ దంపతులు మాట్లాడుతూ భగవాన్ బుద్ధుని మార్గంలో నడుస్తూ మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. పలువురు వక్తలు మాట్లాడుతూ దుర్గం నగేష్ ప్రమీల దంపతులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సమతా ఫౌండేషన్ ద్వారా పేదలకు బడుగు బలహీన వర్గాలకు విద్యా వైద్యం మొదలైన సేవలను అందిస్తున్నారని కొనియాడారు. వారిని ఆదర్శంగా తీసుకొని మనమంతా సేవా మార్గంలో ముందుకు సాగాలని కోరారు అనంతరం సమతా సైనిక దళ్ సభ్యులందరూ ప్రమీల - నగేష్ దంపతులచేత కేక్ కట్ చేపించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ మిఠాయిలు పంచి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ పెద్దపల్లి జిల్లా నాయకులు కుమ్మరి యువరాజ్, ఎన్టీపీసీ కమిటీ నాయకులు చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, చందనగిరి శివప్రసాద్, జిమ్మిడి శాంతి కుమార్, ఆత్రం హరీష్, ఉట్నూరి మహేష్, చీమల సునీత, గోనే ఉమారాణి, నేతకాని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ నాయకులు కామెర ప్రకాష్, కుమ్మరి మల్లేష్, మూడవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదునూరి మల్లేష్, మహిళా అధ్యక్షురాలు నాస సునీత, గుండా శంకర్, కుక్క శ్రీనివాస్ అన్నపూర్ణ కాలనీ మహిళలు పెద్దలు దుర్గం ప్రమీల - నగేష్ దంపతుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మీ రాక మాకెంతో సంతోషం..!

**- మంత్రి పొంగులేటికి ఆరెంపుల గ్రామస్తులు పూల బోకేలతో ఘన స్వాగతం**

**కరపత్రం ఖమ్మం రూరల్ ప్రతినిధి:-**

సర్ నమస్తే సర్... థాంక్యూ సర్ మా ఊరు వచ్చినందుకు....అంటూ ఒక్కొక్కరూ ఒక్కో పూలబొకేతో ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామ పర్యటనకు వచ్చిన తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘన స్వాగతం పలికారు. మీ రాక మాకెంతో సంతోషం అంటూ ఆనందం వ్యక్తం చేశారు. అది చూసిన మంత్రి పొంగులేటి మీ ఆదర అభిమానాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారులను కలిసి వారికి అభినందనలు తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసిన పలువురు లబ్ధిదారుల స్థలాలను పరిశీలించారు.

# ఘన స్వాగతం పలికిన ఆలయ నిర్వాహకులు

**కరపత్రం ఖమ్మం రూరల్ ప్రతినిధి:-**

ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామంలో జరిగిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి యాగశాలలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి అనంతరం ఆలయ ప్రాంగణాన్ని సందర్శించి ఆలయ నిర్మాణ నిమిత్తం రూ. లక్ష రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు...

# మల్లిడి నర్సయ్య (వయస్సు 100) గారి పార్థివ దేహాన్ని నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు,కందాళ, సండ్ర ,ఎమ్మెల్సీ మధు

**కరపత్రం కూసుమంచి ప్రతినిధి:-**

కూసుమంచి మండలం చెగోమ్మ గ్రామం మల్లిడి నరసయ్య గారు తెల్లవారుజామున స్వర్గ్యులైన విషయాన్ని తెలుసుకొని నేడు వారి స్వగృహంలో భౌతికయాన్ని సందర్శించి వారికి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థిస్తూ..వారి కుమారులైన మల్లిడి రామలింగయ్య,మల్లిడి వెంకన్న, సత్యనారాయణ గార్లని పరామర్శించి వారిని ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గారు, సండ్ర వెంకటయ్య గారు, జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గారు కూసుమంచి మండల పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య, బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ వరప్రసాద్,మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్,కొప్పుల ఉపేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ కిషన్ నాయక్, వడ్త్యా బాలకృష్ణ,శ్రీను,జీవన్ వడ్త్యా రాజేష్, సతీష్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## వాసవి హైస్కూల్లో సరస్వతి మాత విగ్రహానికి ప్రత్యేక పూజ.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, ఫిబ్రవరి 03.**



వసంత పంచమి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మెట్పల్లి ఆధ్వర్యంలో వాసవి హై స్కూల్లో సోమవారం సరస్వతి మాత విగ్రహానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రి, పట్టణ అధ్యక్షులు మైలారపు రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎల్మీ రవి, సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్ ,వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్, జిల్లా అదనపు కార్యదర్శి కట్కం శంకర్, వెలగందుల జలంధర్, వెలగందుల లక్ష్మీ నరసయ్య, బండారి గోపి ,బండారి ప్రసాద్, సాయిరాం, సందీప్ ,జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం.



**. ఈనెల 7న నామినేషన్**

**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, ఫిబ్రవరి 3.**

మెట్పల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం నోటిఫికేషన్ ఎక్సేంజ్ శాఖ జారీ చేసినట్లు గీతా పరిశ్రమ శాఖ అధ్యక్షులు పూదరి సుధాకర్ గౌడ్ తెలిపారు.నూతన సహకార ఎన్నికలు తేదీ ఈనెల 17న 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికల్లో జరుగునని అన్నారు. నామినేషన్ దాఖలు ఏడో తారీకు నుండి పదో తారీకు వరకు నామినేషన్ చేయవచ్చని, నామినేషన్ పరిశీలన 11వ తేదీన ఉంటుందని ఎలక్షన్ అధికారులు మల్లేష్ తెలిపారు .ఈ కార్యక్రమంలో గీతా పరిశ్రమ శాఖ అధ్యక్షులు పూదారి సుధాకర్ గౌడ్, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, పూదరి నర్సాగౌడ్, చర్లపల్లి రాజేశ్వర్ గౌడ్, చిన్న అంజయ్యగౌడ్ ,పుల్ల చిన్నయ్య, ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్ ,సుద్దాల వెంకటి, చెర్లపల్లి హనుమాన్ల గౌడ్, శ్రీకర్ గౌడ్ మల్యాల శ్రీనివాస్ గౌడ్ శంకర్ గౌడ్, ముంజే సత్యనారాయణ ,ప్రణయ్, రాజేందర్, తదితరులు, పాల్గొన్నారు

## కాంగ్రెస్ నాయకుని వ్యాపార కేంద్రాన్ని సందర్శించిన జువ్వాడి కృష్ణారావు



**కరపత్రం ఫిబ్రవరి 3**

ఆదివారం మల్లాపురం మండల పర్యటనలో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మల్లాపూర్ లో పర్యటించారు ఇట్టి పర్యటనలో భాగంగా మల్లాపూర్ కు చెందిన జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ కార్యదర్శి ఉప్పులూటి సురేష్ కు సంబంధించిన తిరుమల ఏజెన్సీ వుడ్ కార్వింగ్ వ్యాపార కేంద్రాన్ని సందర్శించారు అనంతరం వ్యాపార నిర్వహణకు అవసరమైన సలహాలను చెప్పారు అనంతరంకాంగ్రెస్ నాయకుడు ఉప్పులూటి సురేష్ సీనియర్ నాయకుడు కృష్ణారావు ని శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు ఇట్టి కార్యక్రమంలో కృష్ణారావు వెంట జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పుండ్రా శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు వన్ తడుపుల నర్సయ్య సిరిపురం రవీందర్ నూతిపెల్లి రాజం పాల్గొన్నారు

## పిసిసి పిలుపు. ధర్నాలో జువ్వాడి కృష్ణారావు..



**కరపత్రం న్యూస్ కోరుట్ల: జనవరి3**

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చేయి చూపించిన బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విప్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ధర్నా లో పాల్గొన్నారు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు కోట్ల కోట్ల రూపాయల అప్పు చేసిందని అయినా ఈ బడ్జెట్ లో కూడా తెలంగాణకు మొండి చేయి చూపించిందని జువ్వాడి కృష్ణారావు అన్నారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు డు అడ్లూర్ లక్ష్మణ్ కుమార్ తదితరులతో పాటు జువ్వాడి కృష్ణారావుపాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కృష్ణరావు తో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ పాటు కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేశం గౌడ్ లక్ష్మీనారాయణ నయం తదితరులు పాల్గొన్నారు

## బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం తెలంగాణాకు అన్యాయం చేసింది

**మంత్రి జూపల్లి కృష్ణారావు ఏ నాగర్ కర్నూల్**
**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 3: జన తెలంగాణ**
**ప్రధాని మోదీ వల్ల తెలంగాణకు ఒరిగిందేమి లేదని**
**విభజన హామీలను కూడా కేంద్రం విస్మరించిందని**
**పాలమూర్- రంగారెడ్డి ప్రాజెక్ట్ కోసం చిల్లిగవ్వ కేటాయించలేదన్నారు**
**తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల వల్ల ఏం ప్రయోజనం లేదని**
**ఇద్దరు కేంద్రమంత్రులు, ఎంపీలు ఢిల్లీ కొట్లాడి నిధులు తీసుకురావాలన్నారు**
**బీహార్ కు భారీగా లబ్ధి చేకుర్చి..**
**తెలంగాణకు మొండిచేయి చూపారని**
**కేసీఆర్ పగల్భాలు పలుకుతున్నాడు**
**అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ను ప్రజలు గట్టిగా కొట్టారని**
**అప్పుడు గట్టిగా పాలన చేసి ఉంటే .. ఈ గతి పట్టేది కాదన్నారు**






**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 3: కరపత్రం**

బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని, నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో మొండిచేయి చూపించినందుకు నిరసనగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పట్టణంలో డా. బీఆర్. అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాల్గొన్నారు. బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ.. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, ప్రధాని నరేంద్రమోదీ వల్ల తెలంగానకు ఒరిగిందేమి లేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీయం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కేంద్రానికి ఎన్ని విజ్ఞప్తులు చేసిన పట్టించుకోలేదని నిధుల విడుదలలో చూపుతున్న నిర్లక్ష్యం, పక్షపాత వైఖరిని ఆయన ఎండగట్టారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తరపున రూ.1.63 కోట్ల ప్రతిపాదనలు సమర్పించగా, మోదీ ప్రభుత్వం వాటిని బుట్ట దాఖలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం .. ఆ రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించి, తెలంగాణకు మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు.విభజనల హామీలను కూడా కేంద్రం విస్మరించిందని, పాలమూర్–రంగారెడ్డి ప్రాజెక్ట్ కు – జాతీయ హెూదా ప్రకటించలేదని, చిల్లి గవ్వ కూడా కేటాయింపులు చేయలేదని, ఏపీలోని పొలవరానికి మాత్రం భారీగా నిధులు కేటాంచారని కేంద్ర వైఖరిని తప్పుపట్టారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ను పట్టించుకోలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ కు మాత్రం నిధులు కేటాయించారని చెప్పారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల వల్ల రాష్ట్రానికి ఒనగూరిన ప్రయోజనం ఏమి లేదని, ఇద్దరు కేంద్రమంత్రులు, ఎంపీలు ఢిల్లీ కొట్లాడి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, అందుకే కేసీఆర్ కు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గట్టి దెబ్బ కొట్టారని, అప్పుడు గట్టిగా పాలన చేసి ఉంటే .. ఈ గతి పట్టేది కాదని పేర్కొన్నారు.

## మహిళా సాధికారత లేకుండా స్థిరమైన భవిష్యత్తును ఊహించలేము

**మాననీయ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ మరియు పరిశ్రమ & వాణిజ్య శాఖ మంత్రి వీ హబ్ సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను కలిసారు.**

**హైదరాబాద్ ఫిబ్రవరి 3 కరపత్రం**



తెలంగాణ మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం స్థాపించిన ప్రాముఖ్యమైన సంస్థ వీ హబ్ ను (వుమెన్ ఎంట్రప్రెన్యూర్స్ హబ్) , గౌరవనీయ తెలంగాణ గవర్నర్ మాననీయ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారు మరియు గౌరవ ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ మరియు పరిశ్రమ & వాణిజ్య శాఖ మంత్రి మాననీయ శ్రీ డి. శ్రీధర్ బాబు సందర్శించారు. మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదనాన్ని ఈ సందర్శన సూచిస్తుందన్నారు

మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిని ప్రోత్సహించే సమగ్ర వ్యవస్థను రూపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది మరో మైలురాయి. పట్టణాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా వ్యాపారవేత్తల అర్థిక మరియు సామాజిక అభివృద్ధికి వీ హబ్ కీలక పాత్ర పోషిస్తోంది. అవసరమైన వనరులను అందించడంతో పాటు, మహిళలందరికీ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే సమగ్ర అవకాశాలను అందించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోందన్నారు

గవర్నర్ మాట్లాడుతూ

మాననీయ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. "మహిళా సాధికారత లేకుండా స్థిరమైన భవిష్యత్తును ఊహించలేము. సమాన అవకాశాలు కల్పించేందుకు, మహిళలకు సుస్థిర బవిష్యత్తును అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళా పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ప్రాముఖ్యమైన భాగస్వాములు" అని గవర్నర్ గారు అన్నారు.

ఐటీ, పరిశ్రమ & వాణిజ్య శాఖ మంత్రి వ్యాఖ్య:

గౌరవనీయ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు గారు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. "మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉంది. మహిళా శక్తి, మహాలక్ష్మి పథకాలు, స్కిల్ యూనివర్సిటీ ద్వారా మహిళలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు, వారి ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మార్చుకునేందుకు మేము కృషి చేస్తున్నాము. టియర్–2 మరియు టియర్–3 నగరాల నుండి వచ్చిన మహిళలకు మరింత ప్రోత్సాహం అందించడం మా ప్రాధాన్యత" అని ఆయన అన్నారు.

సీఈఓ వ్యాఖ్య:

వీ హబ్ సీఈఓ శ్రీమతి సీతా పల్లచోల్లా గారు, "భారతదేశంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన మొట్టమొదటి సంస్థగా, మేము మా బాధ్యతను చాలా ప్రాముఖ్యంగా చూస్తాము. పట్టణ ప్రాంతాల్లోనే కాదు, తెలంగాణలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల వరకు మా సేవలు అందాల్సిందే. ఇది మా బాధ్యత మాత్రమే కాకుండా, మా కట్టుబాటు" అని పేర్కొన్నారు.

మహిళల వ్యాపార అభివృద్ధికి అవసరమైన వనరులు అందించడంతో పాటు, సమాజంలో విస్తృత స్థాయిలో మార్పును తీసుకురావడమే వీ హబ్ యొక్క ప్రధాన లక్ష్యం. మహిళలు ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన భాగస్వాములు కావడం ద్వారా, రాష్ట్ర GDP పెరిగే అవకాశాలు మెరుగవుతాయన్నారు

మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు:

ఈ కార్యక్రమంలో, వీ హబ్ లో ఇన్క్యుబేషన్ మద్దతు పొందిన మహిళా పారిశ్రామికవేత్తలు గవర్నర్ మరియు ఐటీ, పరిశ్రమ & వాణిజ్య శాఖ మంత్రికి తమ వినూత్న ఉత్పత్తులు, ఆలోచనలను ప్రదర్శించారు. టెక్ స్టార్టప్‌ల నుండి హ్యాండిక్రాఫ్ట్స్ వరకు విభిన్న రంగాల వ్యాపారాలను వీరు ప్రదర్శించారు. ఇందులో రాష్ట్రంలోని మంథని లాంటి సుదూరప్రాంతాల నుండి వచ్చిన మహిళా పారిశ్రామికవేత్తలు సైతం పాల్గోనటం వీ హబ్ యొక్క పట్టుదల & ప్రభావాన్ని ప్రతిబింబిస్తోంది. గవర్నర్ మరియు మంత్రి మహిళా పారిశ్రామికవేత్తలతో పరస్పర చర్చలు జరిపి, వారి వ్యాపారాభివృద్ధికి అవసరమైన మద్దతు అందించేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు.

వీ హబ్ మహిళా పారిశ్రామికవేత్తలకు మెంటార్షిప్, క్రెడిట్ లింకేజీ సహాయంతో పాటు మార్కెట్ అనుసంధానం, టెక్నాలజీ వనరులను అందించేందుకు నిరంతరం కృషి చేస్తుంది. ఈ సందర్శన రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ప్రభుత్వం ఎంత ప్రాముఖ్యత ఇస్తుందో తెలియజేస్తుందన్నారు

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ఆసుపత్రిలో రోగులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలి**
**పెద్దపల్లి ఆసుపత్రిని, మైనారిటీ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, ఫిబ్రవరి–03: కరపత్రం**



వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి లోకి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని, రంగంపల్లి లోని మైనారిటీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి లోని ఆయుష్మాన్ భారత్ ఓపి రిజిస్ట్రేషన్, నూతనంగా నిర్మించే ఆసుపత్రి భవనాన్ని, కూల్చివేతకు సిద్ధంగా ఉన్న మూడు వార్డులను, డయాలసిస్ జరుగుతున్న మిషనరీలను, స్కానింగ్ ఓపి రూములను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆప్టల్ ఓపి సర్జరీలు బాగానే జరుగుతున్నాయని ఇవి కాకుండా ఇంకా సర్జరీలు పెరగాలని,కొత్తగా నిర్మించే ఆసుపత్రి బిల్డింగ్ పూర్తి అయ్యే లోపు ప్రస్తుతం ఉన్న వార్డులను తీసివేసే క్రమంలో వాటిని ఎక్కడికి మార్చాలో వాటిపై వెంటనే సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో మాట్లాడి సాయింత్రం సమావేశం ఏర్పాటు చేయాలని ,వాటిలో బిల్డింగ్ కు సంబంధించిన వివరాలు మరియు కూల్చి వేతకు సిద్ధంగా ఉన్న వార్డుల సంబంధిత సమాచారం తీసుకు రావాలని కలెక్టర్ తెలిపారు. మాతా శిశు ఆసుపత్రిలోని ఓపి ఛాంబర్ ఆపరేషన్ థియేటర్ ,జనరల్ వార్డు ఆర్తో, ఆప్టల్, తదితర వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు అనంతరం రంగంపల్లిలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతులపై సానుకూలంగా స్పందించారు . విద్యార్థులతో చిట్–చాట్ చేశారు. %శ% గ్రేడ్ విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. మరియు 40 మంది విద్యార్థులు 9o %+ూ% కంటే ఎక్కువ గ్రేడ్‌లను పొందాలని, అన్ని తరగతుల వసతి గృహాలను తనిఖీ చేశారు . మరియు మెడిసిన్ %డ% సోర్స్ ఆఫ్ మెడిసిన్ గురించి అడిగి తెలుసుకున్నారు. స్టోర్ వస్తువులను కూడా తనిఖీ చేసారు. వంటగది సిబ్బందిని విచారించారు.జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.